

"నువ్వు క్రిమినల్ లాయరువి కాబట్టి నాకో సలహా ఇవ్వాలి" అన్నాడు డాక్టర్ త్రివేది.

ఇంటికి పిలిపించి మరీ సలహా అడుగుతున్నాడంటే... ఆ విషయానికేదో ప్రత్యేకత ఉందని అనిపించింది.

"మరొకరయితే పూర్తిగా చెప్పేవాణ్ణి కాదు. కాని నీకు చెపుతున్నాను. ఎందుకంటే నువ్వు కేవలం న్యాయంకోసం వాదించే లాయరువి మాత్రమే, కారణం దొంగలకి, హంతకులకి శిక్ష పడకుండా కూడా వాదించే లాయరువి. అన్నిటికీ మించి నాకున్న ఓ మంచి స్నేహితుడివి"

కాఫీ 'సిప్' చేస్తూ మౌనంగా అతడినే గమనిస్తున్నాను. 'డాక్టర్ త్రివేదికి ఓ క్రిమినల్ లాయర్‌తో సలహా తీసుకోవాల్సిన అవసరం ఏమయి ఉంటుంది?"

"నేనో హత్యచేశాను" అన్నాడు.

"వాట్??" అదిరిపడ్డాను. కప్పులో కాఫీ కొంచెం వొలికింది.

"ఎస్...నేనో హత్య చేశాను" చాలా 'కూల్'గా అన్నాడు. "ఇప్పుడు నా సమస్యల్లా... ఆ శవాన్ని వదిలించుకోవటం."

"అసలు హత్య ఎందుకు చేశావ్?" అడిగాను. నా వృత్తిలో శవాలు, హత్యలు, నేరస్థులు కొత్తకాదు. మరొకరయితే ఇలా 'షాక్' అయ్యేవాడ్ని కాదు. కాని త్రివేది చాలా నెమ్మదస్తుడు. 'పోస్ట్‌మార్టమ్'లు చేయటం, ఆపరేషన్లు చేయటం అతని వృత్తిలో మామూలు. అయినా, తన వంటిమీద పారే చీమని జాగ్రత్తగా పట్టుకుని కింద వదిలేసే ప్రవృత్తి అతనిది. అలాంటి వాడు ఓ హత్య చేశాడంటే..."

"అహల్యకి అతనితో అక్రమ సంబంధం ఉంది" విచారంగా అన్నాడు.

నన్ను చుట్టుముడుతున్న డజన్లకొద్దీ ప్రశ్నలు, సందేహాలూ ఈ ఒక్క సమాధానంతో పటాపంచలయి పోయాయి. మరో ప్రశ్న అడగటం అనవసరం.

అహల్య అతని రెండో భార్య. ఆవిడ గురించి ఎంతో మంది ఎన్నో రకాలుగా అనుకుంటూ ఉంటారు. ఆ విషయం నాక్కూడా తెలుసు, భార్య పాతివ్రత్యం ఊరందరికీ తెలిసాక భర్తకు తెలుస్తుంది అన్న 'నానుడి' త్రివేది విషయంలో నిజమైంది. ఊరందరికీ తెలిసినా భర్తకు తెలియక పోవటమే మంచిదేమో ననిపించింది.

అతణ్ణి ఏవిధంగా ఊరడించాలో తెలియక అన్నాను" ఆమె అలాంటిదని నేననుకోను"

"అఫ్‌కోర్స్! నేనూ అలాగే అనుకున్నాను. కాని.. ఇది పచ్చినిజం, నా కళ్ళారా చూశాను"

ఇంకేం మాట్లాడలేకపోయాను.

"అయినా... అది మంచిదయితే నాకీ రోజు ఈ సమస్య వచ్చి ఉండేదికాదు. దాన్ని కూడా చంపేయాల్సింది. కాని" చేతులు రావటంలేదు"

"నో...నో... అలాంటి ఆలోచనలు మానుకో. ఇకనైనా బుద్ధిగా ఉండమని చెప్పు.. జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావ్?"

"అది తోచకే నిన్ను రమ్మన్నాను"

"శవం ఎక్కడుంది"

"ఇక్కడే"

"ఎలా చంపావ్?"

"పాయిజన్‌తో"

"ఒకసారి చూస్తాను" లేచి నిలబడ్డాను.


"అవసరం లేదు"

అనుమానంగా చూశానతని వంక. "లాయర్ల దగ్గరా, డాక్టర్ల దగ్గరా ఏమీ దాచకూడదు"

స్నేహపూర్వకంగా నవ్వాడు "కాని... డాక్టర్లు లాయర్లదగ్గర కొన్ని దాయటం కొత్తేమీ కాదు"

"నా సహాయం కోరినప్పుడు దాపరికం లేకుండా చెప్పటం నీ కనీస ధర్మం."

"అవును... అదీ నిజమే.... కాని..." కాసేపు సంశయిస్తూ ఆగి అన్నాడు "ఆ వ్యక్తి ఎవరో తెలిస్తే




నాకు సహాయం చేయటానికి వెనకాడుతావేమో నన్న అనుమానం...."

"అతడు నాకంత బాగా తెలిసిన వ్యక్తా?"

"అవును."

"............"

"పోనీలే" ఇబ్బందిగా కదిలాడు త్రివేది "నీకి ష్టం లేకపోతే ఈ విషయం ఇంతటితో మర్చిపో. నా తంటాలేవో నేనే పడతాను."లేచినిలబడ్డాడు.

డాక్టర్ త్రివేదికి సహాయపడాలన్న ఆలోచన కంటే అతడు చంపిన వ్యక్తి ఎవరో తెలుసుకోవా లన్న ఆరాటం ఎక్కువైంది నాలో.

"సరే, నేను సహాయపడతాగా... డోంట్ వర్రీ" నాలో లాయరు బుర్ర పనిచేయటం మొదలెట్టింది. "ఎవరిని చంపావో చెప్పటం నీకి ష్టం లేదు. ఆ విషయం వదిలేయ్. కాని ఎలా చంపావో చెప్పు. పూర్తి వివరాలుకావాలి."

"ఎందుకు?"

"ఎందుకేమిటి.. రేపు కోర్టులో కేసు వాదించ టానికి అవసరమవుతుంది. ఎప్పుడు, ఎక్కడ చంపావో తెలిస్తే సరిగ్గా ఆ సమయంలో నీకు ఓ దొంగ 'ఎలిబి' సృష్టించాలి..."

ఆ ఎలిబి నాకుంది. నువ్వేం శ్రమపడొద్దు"

"గుడ్! కేసు చాలా వరకు సులభమయిపో యింది. 'ఈజీగా' నెగ్గుకురావచ్చు."

"కాని, ఓ చిన్న సమస్య ఉంది."

"ఏమిటది?"

"మా 'లాబ్'లో ఓ ప్రత్యేకమైన విషముంది. అది శరీరంలోకెళ్ళిన తర్వాత దాదాపు రెండు గంటలకి మనిషి చచ్చిపోతాడు. దాంతో నేనతణ్ణి హత్య చేశాను."

"విషప్రయోగం జరిగినట్టు అతనికి అను మానం కలుగలేదా?"

"కలగదు. చావటానికి అయిదు నిమిషాల ముందు మాత్రం 'పెరాలిసిస్' అంటే పక్షవాతం వస్తుంది. కాళ్ళూ చేతులూ పడిపోతాయి. ఆ తర్వాత నాలుక పిడచకట్టుకుపోవటం, మాట పడిపోవటం జరుగుతుంది.

"నువ్వా విషాన్ని ప్రయోగించాక అతడు వెళ్ళి పోయాడు. రెండుగంటల తర్వాత ఎక్కడో చచ్చి పడుంటాడు. అవునా?"

"కాదు. గంటన్నర తర్వాత వచ్చి కలవమన్నా ను. వచ్చాడు. వచ్చిన కాసేపట్లోనే చచ్చిపోయా డు."

"ఎందుకలా రమ్మన్నావ్? ఎక్కడో చచ్చిపోతే ఇలా శవాన్ని వదిలించే సమస్యఉండకపోయేదిగా?"

"ఒక విధంగా కరక్టే! కాని, అతని శరీరం నీలంరంగులోకి మారిపోతుంది. అప్పుడది విష ప్రయోగమని ఏ డాక్టరైనా చెప్తాడు. పోలీసులు, 'పోస్ట్‌మార్టమ్'లు... తర్వాత ఫలానా విషంతో మరణించాడని తేలుస్తారు."

"తెలిస్తే నీకేం నష్టం?"

"ఆ విషం ఎక్కడంటే అక్కడ దొరకదు. కొన్ని 'లాబొరేటరీ'ల్లో మాత్రమే దొరుకుతుంది వాటిల్లో నా 'లాబొరేటరీ' ఒకటి. ఇంకా ఆరా తీస్తే నా భార్యకూ అతనికీ ఉన్న అక్రమసంబంధం బయటపడుతుంది. సహజంగా నన్నుమానిస్తారు ఆ తర్వాత పరిశోధనలో ఏం జరుగుతుందో...నీకు వేరే చెప్పాలా?"

ఆ విశ్లేషణకి నేనేమీ ఆశ్చర్యపోలేదు. కాని... ఆ విశ్లేషణ త్రివేది నుండి వచ్చినందుకు మాత్రం ఆశ్చర్యపోయాను. పరిస్థితులు పాఠాలు నేర్పిస్తాయం టే... ఇలాగే మరి.

"ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావ్? నేనేవిధం గా సహాయపడగలను?"

"ఈ శవాన్నెలా వదిలించుకోవాలో తెలియ టం లేదు. ఏదైనా సలహా చెప్పు."

'ఓ హత్య చేయటం ఎంత సులభమో, హత్యా నంతరం శవాన్ని వదిలించుకోవడం అంత కష్టం. చాలా మంది హంతకులు ఇక్కడే 'ఫెయిల్' అయి దొరికిపోతూ ఉంటారు. శవాన్ని ముక్కలుగా కోసి గోనెసంచిలో వేసి డ్రయినేజిల్లో పారేసిన కేసులు

న్నాయి. హంతకుడు తన ఇంటి ఆవరణలోనే గొయ్యి తీసి శవాలను పాతిపెట్టిన కేసులున్నాయి. ఏ అర్ధరాత్రి తప్పుడో శవాన్ని తీసుకెళ్ళి నదిలో పారేసిన సంఘటనలున్నాయి.

"ఆగు...." ఆసక్తిగా అన్నాడు త్రివేది. "ఈ చివరిది బాగుంది. నదిలో పారేద్దాం."

"అదే చాలావరకు మంచిది. శవం తేలకుండా ఓ బండరాయిని కట్టి పారేస్తే మరీ మంచిది."

"గుడ్....కాని, ఎలా పారేద్దాం... అంటే ఎక్కడ పారేద్దాం. డాక్టర్ త్రివేదిలో తొందర పాటు కనిపిస్తోంది.

"ఒడ్డు దగ్గరనుండి కాదు. 'బ్రిడ్జి' మీద నుండి నదిలోకి విసిరేద్దాం."

"థాంక్స్!" త్రివేదికి కృతజ్ఞతగా నా చేతులు పట్టుకున్నాడు. "థాంక్స్ ఎలాట్."

"ఒకవేళ రెడ్‌హాండెడ్‌గా పట్టుబడితే నాక్కూడా నీతో సమానమైన శిక్షపడుతుంది తెల్సా?"

"సారీ ఫర్‌దట్ ట్రబుల్"

"ఇట్సాల్‌రైట్. సరిగ్గా పన్నెండు గంటలకి కార్లో శవాన్ని తీసుకుని 'బ్రిడ్జి' మీదకూడా. నీకోసం కాచుకుని ఉంటాను."

"అలాగే... కాని, ఓ తాడు, బండరాయి నువ్వు తీసుకురాగలవా?" అడిగాడు.

"సారీ... నేరుగా నేనో 'క్లయింట్' దగ్గరకెళుతున్నాను. అక్కడ పని చూసుకుని 'బ్రిడ్జి' మీద నీకోసం ఎదురుచూస్తుంటాను."

"అలాగే" మళ్ళీ సంశయిస్తూ ఆగాడు త్రివేది "శవం బరువెక్కువ. అప్పట్లోగా నువ్వు రాకపోతే, నేను చిక్కుల్లో....."

"వస్తా. తప్పకుండా వస్తాను..."

"ఒకవేళ నేనే నీకంటే ముందు వస్తేనో!"

## కొందరి పద్ధతి



తమకుతామే తెలుసుకుంటారు కొందరు, చెబితే అర్థం చేసుకుంటారు మరి కొందరు, కొడితేనే తెలుసు
కుంటారు కొందరు, అనుభవంతో కానీ తెలుసుకోరు మరికొందరు.

అయితే ఇందుకు భిన్నం మరికొందరు
తెలిసీ తెలియని మనుషులు
వారే సిసలైన మూర్ఖులు
చేసేవి తప్పులు— చెప్పేవి గొప్పలు.

భయంగా అన్నాడు. అతని తీరుకి నవ్వొచ్చింది. "ఓ అరగంట ముందే వస్తాను. సరేనా?"

"అంటే పదకొండున్నరకి..."

"కరెక్ట్." టైం చూసుకున్నాను పదింబావైంది. "నా క్లయింట్ ఎదురుచూస్తుంటాడు" అని చెప్పి సెలవు తీసుకుని బయటపడ్డాను.

నిజానికి అప్పుడు ఏ క్లయింటూ నాకోసం ఎదురుచూడటంలేదు. ఈ హత్య విషయంలో నా చేతికి మట్టి అంటుకోవటం నాకిష్టంలేదు. ఆ 'మూడో మనిషి' ఎవరో చూడాలన్న కుతూహలం తప్ప ఈ సంఘటనతో ఏ సంబంధం పెట్టుకోవటం నాకిష్టంలేదు. 'బ్రిడ్జి' మీదకు నా కారు కూడా తీసుకెళ్ళను. అసలు నేనీ చాయలకు వెళ్ళి వచ్చిన అనుమానం కూడా ఎవరికీ రాకుండా జాగ్రత్తపడాలి. అలాంటిది తాడు గట్రా తీసుకెళితే ఇంకేమైనా ఉందా?

అనుకున్న ప్రకారం సరిగ్గా పదకొండున్నరకి నడుచుకుంటూ 'బ్రిడ్జి' మీద కెళ్ళి త్రివేదికోసం ఎదురుచూస్తూ ఓ బెంచీమీద కూర్చున్నాను. పరవళ్ళు తొక్కుతూ పరిగెడుతున్న నదీజలాల శబ్దం. చల్లగాలి, ఆకాశంలో అర్ధచంద్రుడు, నక్షత్రాలు....

ఓ సిగరెట్ తీసివెలిగించాను. త్రివేదిలో వచ్చిన మార్పుని గురించి ఆలోచిస్తూ ఉండిపోయాను. 'ఓ మంచి మనిషి రాక్షసుడుగా కావటానికి స్త్రీ కారణం కాగలదు' అని మరోసారి రుజువైంది. ఎంత కూడదనుకున్నా నా ఆలోచనలు ఆ మూడో మనిషి మీదకే పోతున్నాయి. 'నాకు బాగా తెలిసిన ఆ మనిషి ఎవరై ఉంటాడు? అహల్యకి ఇంకా ఎంతమందితో సంబంధం ఉందో? త్రివేదికి ఒక్కొక్కరి గురించి తెలుస్తూ పోతే ఇలా హత్యలుచేస్తూనే ఉంటాడా? ప్రస్తుతం త్రివేది హంతకుడు. ఇంకా హత్యలు చేస్తాడు. అతనికి దూరంగా ఉండటం మంచిదేమో!''

ఇంతలో డాక్టర్ త్రివేది కారొచ్చి ఆగింది. లేచి కారుదగ్గరికి వెళ్ళబోయిన నన్ను వారిస్తూ కారు వెనుకవైపు 'బ్రిడ్జి' కమ్మెల వైపుకు వచ్చేట్టు 'రివర్స్' చేసి ఆపాడు. అలా ఆపటం నాకు నచ్చింది. 'డిక్కీ' తెరిచి శవాన్ని సులభంగా మోసుకు వచ్చి నదిలోకి విసిరేయవచ్చు. అతడు కారుదిగుతూ ఓ బండరాయిని, రెండుమీటర్ల తాడునూ తెచ్చి కిందపెట్టి నాపక్కన కూర్చున్నాడు.

"శవాన్ని కూడా తెద్దాం" అన్నాడు.

"కాస్త దూరంలో మరో కారు ఆగి ఉంది. అదెప్పుడైనా ఇటువైపు రావచ్చు. కాసేపు ఆగుదాం." అన్నాడు.

"సరే" అని మరో సిగరెట్ వెలిగించాను.

అంతలో తాడుకొసని ఆ రాయికిముడివేశాడు.

"చెప్పిన ప్రకారం వచ్చినందుకు థాంక్స్. అహల్య ఇకముందు బుద్ధిగా ఉంటానని ప్రమాణం చేసింది."

"హత్య చేసినట్టు చెప్పావా?"

"చెప్పలేదు. ఆ అవసరం కూడా రాదనుకుంటాను. అక్రమ సంబంధాల గురించి మాత్రం అడిగాను. ఒప్పుకుంది కాని అందులో తన తప్పేం లేదని ఏడ్చింది. తాను ఎప్పుడో చేసిన ఓ తప్పుని పది మందిలో వెల్లడిచేసి, పరువు తీస్తా



## పురాణంకు గౌరవ డాక్టరేట్

ప్రముఖ రచయిత, ఉదయం వారపత్రిక అడ్వయిజరీ ఎడిటర్ శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మకు గౌరవ డాక్టరేట్ ఇవ్వాలని తెలుగు విశ్వవిద్యాలయం పాలకమండలి నిర్ణయించింది. సెప్టెంబర్ 24న జరిగే విశ్వవిద్యాలయం ప్రథమస్నాతకోత్సవంలో ఆయన డాక్టరేట్ ప్రదానం చేస్తారు. అదేవిధంగా ప్రముఖ చలన చిత్ర నటుడు శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావుకు స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్ ఇవ్వాలని విశ్వవిద్యాలయం పాలకమండలి నిర్ణయించింది.

నని బెదిరించి వాడు లొంగదీసుకుంటే అది తన తప్పుకాదనీ, పైగా 'నా పరువు' కాపాడటానికి తను త్యాగం చేశానంటోంది."

"అలా పరువు తీస్తానని బెదిరించి లొంగదీసుకున్న ఆ వ్యక్తి ఎవరు?"

ఓ కారు వేగంగా దూసుకుపోయింది. అతడు వచ్చిన వైపు నుండి కాదు. మరో వైపు నుండి.

"ఎవరైనా మనలని కనిపెడుతున్నారేమో?" త్రివేది కళ్ళల్లో భయం చూస్తే నవ్వొచ్చింది. "హంతకుల సైకాలజీ చాలా చిత్రంగా ఉంటుంది చంపేటప్పుడు ఎక్కడలేని తెగింపు, చంపాక ఎక్కడ లేని భయం పుట్టుకొస్తాయి హంతకులకు. ఈ సైకాలజీ నాకు బాగా తెలుసు. ఇలాంటి భయంతోనే చివరకి తప్పులు చేసి ఆధారాలు వదిలేసి దొరికిపోతూ ఉంటారు" అన్నాను.

"క్రిమినల్ లాయరుగానే కాక, ఓ మిత్రుడిగా చాలా సహాయం చేశావ్. మరోసారి థాంక్స్."

అతడు మౌనంగా అలాగే నా పక్కన కాసేపు కూర్చున్నాడు. నా దృష్టి మాత్రం ఎదురుగా కనిపిస్తున్న కారు డిక్కీ మీదే ఉంది. అక్కడి నుండి దృష్టి మరల్చుకోలేకపోతున్నాను.

ఈ విషయం త్రివేది గమనించాడల్లే ఉంది "నేను చంపిన వాణ్ణి త్వరగా చూడాలనుందా?" అన్నాడు. అలా అంటూనే వెళ్ళి 'డిక్కీ' తెరిచాడు. చీకట్లో ఏమీ కనిపించటంలేదు.

అతడు తిరిగి వచ్చి నా పక్కన కూర్చున్నాడు. 'టార్చ్' వెలిగించి 'డిక్కీ'లోకి 'ఫోకస్' చేశాడు. అందులోని దృశ్యం చూసిన నేను అవాక్కయిపోయాను. రెప్పకూడా వేయలేక అలా చూస్తూ ఉండిపోయాను. మూడవ మనిషి ఎవరో తెలిసిపోయింది!

"నువ్వు ఆశ్చర్యపోతావని నాకు తెలుసు. అందుకే చెప్పలేదు." చిన్నగా నవ్వాడు త్రివేది. "నిజం తెలిస్తే... నువ్విలా సహాయపడే వాడవి కాదు. అవునా?"

బెంచీ మీదున్న నా చేతి వేళ్ళ మధ్య నిప్పునలిగిపోతోంది.... మనసులాగే... అదో రకం వాసన!

ఆ క్షణంలో ఒకేసారి రెండు విషయాలు గుర్తుకొచ్చాయి.

ఒకటి— దాదాపు రెండు గంటల క్రితం త్రివేది ఇచ్చిన 'వగరుకాఫీ'.

రెండోది— దాదాపు రెండు నెలల క్రితం తన్మయత్వంలో నాపక్కన పడుకున్న దిగంబర అహల్య.

కారుడిక్కీ ఖాళీగా ఉంది.

తాడు రెండో కొస పట్టుకుని లేచి నిలబడ్డాడు డాక్టర్ త్రివేది.

## తిరుమల రామచంద్రకు రాజాలక్ష్మీ సాహిత్యపురస్కారం



రాజా లక్ష్మీ సాహిత్య పురస్కారాన్ని ఈ సంవత్సరం సుప్రసిద్ధ పండితుడు, బహుభాషావేత్త, బహుగ్రంథకర్త డాక్టర్ తిరుమల రామచంద్రకు ఇవ్వడానికి నిర్ణయించినట్లు శ్రీ రాజాలక్ష్మీఫౌండేషన్ వెల్లడించింది.

రాజా లక్ష్మీ సాహిత్య పురస్కారం 10,000 రూపాయలు, ప్రశంసాపత్రం నవంబర్ 19న మద్రాసులో జరిగే ప్రదానోత్సవంలో శ్రీ రామచంద్ర గారికి బహూకరిస్తారు.


డాక్టర్ తిరుమల రామచంద్ర సుప్రసిద్ధుడైన భాషా లిపిశాస్త్ర వేత్త, బహు భాషాకోవిదుడు, పరిశోధకుడు, బహుళ గ్రంథకర్త, ఆరితేరిన పత్రికా రచయిత. దేశస్వాతంత్ర్య సమరంలో పాల్గొని కారాగార క్లేశాలు అనుభవించిన బహుకొద్దిమంది తెలుగు సాహితీవేత్తలలో శ్రీ రామచంద్ర ఒకరు. వీరికి తెలుగు,సంస్కృతం, ప్రాకృతం, హిందీ, కన్నడం, తమిళం, ఆంగ్లభాషలలో పాండిత్యం, పరిజ్ఞానం ఉన్నాయి. విద్వాన్, శిరోమణి, హిందీప్రభాకర్, ఆయుర్వేద భూషణ్ వంటి ఉన్నత పరీక్షల్లో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులయిన శ్రీ రామచంద్రమూర్తి, ఆరు దశాబ్దాలుగా తెలుగు భాషాసాహిత్యాలకు ఎనలేని సేవచేస్తున్నారు. పలు పత్రికల సంపాదకవర్గాల్లో పనిచేసి సుదీర్ఘానుభవం గల పత్రికా రచయిత. ఆయన అనేక సన్మాన సత్కారాలు అందుకున్నారు. ఇటీవలనే ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వీరికి గౌరవ డాక్టర్ పట్టం ఇచ్చి సత్కరించింది.

మనలిపి పుట్టుపూర్వోత్తరాలు, హిందువుల పండగలు, నుడి—నానుడి, లలితవిస్తరం, మూడు శిఖరాలు వంటి అనేక ఉత్తమ సాహిత్య గ్రంథాలు వ్రాశారు. 1913లో అనంతపురం జిల్లాలో జన్మించిన రామచంద్రగారు, మద్రాసు పంజాబ్ విశ్వవిద్యాలయాలలోను, మద్రాసు సంస్కృత కళాశాలలోను చదువుకున్నారు.

శ్రీ రాజాలక్ష్మీ ఫౌండేషన్ అధినేత షష్టిపూర్తి సందర్భాన్ని పురస్కరించుకొని 1987లో రాజా లక్ష్మీ సాహిత్యపురస్కారం ఏర్పాటుచేయబడింది.

—సివి రమణయ్య రాజా
మేనేజింగ్ ట్రస్టీ

## దూరపుకొండలు



NORMANROW బ్రిటిష్ కార్టూనిస్టు. లండన్‌లోనివాసం బ్రిటన్‌లో వెలువడే దిన, వారపత్రికలలో కార్టూన్లు వేస్తుంటాడు. ఈ కార్టూనుకు అతడు రాసిన వ్యాఖ్య ఇది. "I HAVE TROUBLE WITH MY BACK EVERY MORNING DOCTOR, I JUST CAN'T GET IT OFF THE BED!!"

సోమరిపోతులమీద చాలా గొప్ప కార్టూన్ చక్కటి వ్యాఖ్యతో రూపొందించాడు. 'సోమరిపోతులు' మంచి సబ్జెక్టు.

జయదేవ్